క్లుప్తంగా

ఇళ్ల స్థలాలు కేటాయించాలని వినతి



ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న ముదిమాణిక్యం గ్రామస్తులు

మిర్యాలగూడ టౌన్ : అడవిదేవులపల్లి మండలం ముదిమాణిక్యంలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ శనివారం ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. అదే విధంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌లను కోరారు. అదే విధంగా గ్రామంలో నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని అధికారులను కోరారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

గుర్రంపోడు : మండలకేంద్రంలో తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్లకు మే 5 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జి. రాగిణి ఒక ప్రకటనలో కోరారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మౌలిక వసతులు కల్పించాలి

పెద్దవూర : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చినపాక లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. తూకంలో మోసాలను అరికట్టాలని, కొనుగోళ్లను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. బస్తాల కొరత, లారీలు సకాలంలో రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దుబ్బ రామచంద్రయ్య, నాయకులు దోరెపల్లి మల్లయ్య, తరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్‌కు మొక్క అందజేస్తున్న సిబ్బంది

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ తహసీల్దార్‌గా సంతోష్ కిరణ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. మిర్యాలగూడ మండలంలో రెవెన్యూ సమస్యలు ఏమైన ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. బాధ్యతల నిర్వహణలో అందరూ సహకరించాలని కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ సంతోష్ కిరణ్‌కు మిర్యాలగూడ డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్, ఆర్ఐ ఠాగూర్ రామకృష్ణ, బాణావత్ సత్యనారాయణలతో పాటు సిబ్బంది మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

గాలివానకు కూలిన విద్యుత్ స్తంభం



బట్టుగూడెంలో కూలిన విద్యుత్ స్తంభం

పెద్దవూర : మండలంలో శుక్రవారం రాత్రి వీచిన బలమైన ఈదురు గాలులకు విద్యుత్ స్తంభం కూలిపోయింది. మండలంలో బట్టుగూడెం గ్రామంలో పెద్దవాగు వంతెన సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద బలమైన ఈదురు గాలులకు విద్యుత్ స్తంభం విరిగి వ్యవసాయ పొలాలకు వెళ్లే దారిలో పడిపోయింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా కప్పిన పట్టాలు కొట్టుకుపోయాయి.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

నిడమనూరు : మండలంలోని వెనిగండ్ల గ్రామంలో రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, కాంగ్రెస్ నాయకుడు ఎడవెల్లి వల్లభరెడ్డిలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ సత్యం, వల్లభరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ రహదారుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నందికొండ మట్టారెడ్డి, శ్రీనివాసరెడ్డి,సహకార సంఘం డైరెక్టర్ పోలె రవి, శివమారయ్య, మహిళా కాంగ్రెస్ నాయకులు స్వర్ణలత, సుధాకర్, తిరుమల్, మారయ్య, తదితరులు పాల్గొన్నారు.

లారీలు రావు.. కాంటా వేయరు

- ధాన్యం రవాణాకు లారీల కొరత
- రోజుల తరబడి రైతుల ఎదురుచూపు
- భయపెడుతున్న అకాల వర్షాలు

గుర్రంపోడు : అరుగాలం కష్టపడి పడించిన ధాన్యం అమ్ముకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన ధాన్యాన్ని రోజుల తరబడి కొనుగోలు చేయకపోవడంతో పట్టాల ఖర్చులు, రోజు కుప్పల వద్ద పడిగాపులతో రైతులకు భారంగా మారింది. మండలంలోని ఐకేపీ,పీఏసీఎస్ కేంద్రాల ద్వారా జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లు లారీల కొరతతో నత్తనడకన సాగుతున్నాయి. కేంద్రాల్లో రోజుల తరబడి నిరీక్షించాల్సి రావడంతో అడపాదడపా



కొప్పోలు కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం రాశులు

కురుస్తున్న అకాల వర్షాలకు ఇరవై రోజులుగా ధాన్యం ఆరబెట్టి కుప్పలు చేయడానికి కూలీ డబ్బులు, ధాన్యంపై కప్పేందుకు పట్టాల కిరాయిలు పెరిగిపోతూ భారంగా మారుతుంది. మండలంలోని 13ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. కేంద్రాలకు కొన్నింటికి రెండు,మూడు రోజులకు ఒక లారీ మాత్రమే వస్తున్న పరిస్థితి ఉంది.

కేంద్రాల్లో 8వేల మెట్రిక్ టన్నుల ధాన్యం

మండలంలో ధాన్యం కొనుగోళ్ల యాసంగి సీజన్‌లో 20వేల మెట్రిక్ టన్నులుగా అధికారులు అంచనా వేయగా దిగుబడి ఆశాజనకంగా ఉండటంతో అంతకు మించి ధాన్యం రాగలదని భావిస్తున్నారు. ఇప్పటి వరకు 12వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగాయి. మరో 8వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరగాల్సి ఉంది. మండలంలోని కొప్పోలు ధాన్యం కొనుగోలు కేంద్రంలో 60 లారీల ధాన్యం నిల్వ ఉండగా ఇలా రోజు ఒకటి, రెండు లారీలు వస్తే మరో నెల రోజులు గడిచినా కొనుగోళ్లు పూర్తయ్యే పరిస్థితి లేదు.

లారీల సమస్య పరిష్కరించాలి



లారీల కొరతతో తీవ్ర జాప్యం జరుగుతుంది. మూడు వందల బస్తాల ధాన్యం తెచ్చి ఇరవై రోజులవుతుంది. పట్టాల ఖర్చు భారమవుతుంది. అకాల వర్షం ఎప్పుడు వస్తుందోనని భయంగా ఉంది. ధాన్యం ఆరబెట్టి దగ్గరకు చేర్చడానికి కూలీ డబ్బులు పెరిగిపోతున్నాయి. తేమశాతం వచ్చినా లారీలు లేక కాంటా వేయడం లేదు.

– చింతల ఎల్లయ్య, రైతు కొప్పోలు

అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నం



కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. 60శాతం కొనుగోళ్లు పూర్తి చేశాం. లారీల అవసరాన్ని ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. ధాన్యం ఎక్కువగా ఉన్న కొప్పోలు కేంద్రానికి లారీలు ఎక్కువగా వచ్చేలా పీఏసీఎస్ చైర్మన్ గట్టిగా ప్రయత్నిస్తున్నారు.

– కె. మాధవరెడ్డి, వ్యవసాయాధికారి

మాదిగల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : తెలంగాణలో మాదిగల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. రాష్ట్రంలో మాదిగలకు సీఎం రేవంత్‌రెడ్డి తొమ్మిది శాతం రిజర్వేషన్ కల్పించడంపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ కౌన్సిలర్ కొమ్ము శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాదిగల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకోని కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలకు తొమ్మిది శాతం రిజర్వేషన్ కల్పించిందన్నారు. తొమ్మిది శాతం రిజర్వేషన్లతో మాదిగలు బలోపేతం అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, చిన్నపంగు శ్రవణ్‌కుమార్, పుల్లెంల సతీష్, రామకృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బత్తుల లక్ష్మారెడ్డి

భాస్కర్‌రావు అవినీతిపై విచారణ చేపట్టాలి



కళాభారతి వద్ద మాట్లాడుతున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి

మిర్యాలగూడ : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు చేసిన అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని కళాభారతి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రవీంద్రభారతి పేరును తీసివేసి కేసీఆర్ కళాభారతిగా గత ప్రభుత్వంలో పెట్టారని, ఆ పేరులో కేసీఆర్ అక్షరాలను మున్సిపల్ అధికారులు తొలగించారని, కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. 2006 నుంచి మినీ రవీంద్రభారతి పూర్తయ్యేంతవరకు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులతోనే జరిగిందన్నారు. రూ.9.30 కోట్లతో మినీ రవీంద్రభారతి ఆడిటోరియం నిర్మించారని బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేనప్పటికీ మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు కేవలం తన బినామీలకు, కాంట్రాక్టర్లకు బిల్లులు ఇప్పించేందుకు మినీ రవీంద్రభారతికి కేసీఆర్ పేరు పెట్టారని అది ప్రజలందరికీ తెలుసన్నారు. తెలంగాణ గురించి మాట్లాడే హక్కు బీఆర్ఎస్ నాయకులకు, భాస్కర్‌రావుకు లేదన్నారు. ఇప్పటికైనా మినీ రవీంద్రభారతీ(కళాభారతి)గురించి భాస్కర్‌రావు ఇష్టంవచ్చినట్లు మాట్లాడితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరు బాలు, కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, నాయకులు బెజ్జం సాయి, పొదిల శ్రీనివాస్, కొమ్ము శ్రీను, సలీం, దేశిడి శేఖర్‌రెడ్డి, పందిరి అనిత, కొమ్మన నాగలక్ష్మీ, జావిద్, జాని, అమృతరెడ్డి, రామకృష్ణ, యాదగిరి, అబ్దుల్లా, బాసాని గిరి పాల్గొన్నారు.

డ్రగ్స్ వాడొద్దు.. ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు

- మాదక ద్రవ్యాలపై ఉపాధ్యాయుడి ప్రచారం

మిర్యాలగూడ అర్బన్ : డ్రగ్స్ వాడొద్దు.. ప్రాణాల మీదకు తెచ్చుకుని యువత బంగారు భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని కోరుతూ ఉపాధ్యాయుడు వినూత్న ప్రచారం చేస్తున్నాడు. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న రాచకొండ ప్రభాకర్ శనివారం రాత్రి మిర్యాలగూడ పట్టణంలోని సుందరయ్య పార్కులో వినూత్న వేషధారణలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి యువత ఎక్కువగా గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ విలువైన జీవితాలను నాషనం చేసుకుంటున్నారని, దీంతో కొన్ని కుటుంబాలు తీవ్ర సంక్షభంలోకి నెట్టబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఉపాధ్యాయుడిగా పని చేస్తూనే తన వంతు



డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు ప్రభాకర్

సాయంగా జాతరలు, వారంతపు సంతలు, జనసందోహం ఉన్న ప్రాంతాల్లో డ్రగ్స్ నివారణకు తీసుకునే చర్యలపై కరపత్రాలు పంచుతూ యువకులకు అవగాహన కల్పిస్తున్నానన్నారు. యువకుల ప్రవర్తనలు తల్లిదండ్రులు గమనిస్తుండాలని వారి ప్రవర్తనలో మార్పు కనిపిస్తే జాగ్రత్తపడి మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించాలని సూచించారు.

మార్షల్‌ఆర్ట్స్‌తో ఎన్నో ఉపయోగాలు



బెల్టులు పొందిన విద్యార్థులతో ఎస్ఐ రామకృష్ణ

నల్లగొండ టూటౌన్ : తైక్వాండో, మార్షల్‌ఆర్ట్స్‌తో ఎన్నో ఉపయోగాలు ఉంటాయని నల్లగొండ జీఆర్‌పీ ఎస్ఐ రామకృష్ణ అన్నారు. శనివారం పట్టణంలో తైక్వాండో రాష్ట్ర స్థాయి బెల్టు గ్రేడింగ్ టెస్టులో పాల్గొన్న విద్యార్థులకు ఆయన బెల్టులు అందజేసి మాట్లాడారు. తెక్వాండో నేర్చుకోవడంతో యువత, విద్యార్థుల్లో క్రమశిక్షణ పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కోచ్ చింత అనిల్‌కుమార్, నాగిళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న విశారదన్ మహరాజ్

నిడమనూరు : ఆత్మహత్యకు పాల్పడ్డ దళిత యువతి మల్లీశ్వరి కుటుంబాన్ని ధర్మ సమాజ్‌పార్టీ అధినేత విశారదన్ మహరాజ్ శనివారం సాయంత్రం పరామర్శించారు. నిడమనూరు మండలం, బొకమంతలపాడు గ్రామంలోని నివాసంలో మల్లీశ్వరీ సోదరుడు, తల్లీదండ్రులను పరామర్శించి, మల్లీశ్వరీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తన వంతు సాయం అందిస్తానని చెప్పి, ఓదార్చరు.. కుల వివక్షతో ఆత్మహత్యకు పాల్పడ్డ దళిత యువతి మల్లీశ్వరీ కటుంబానికి తగిన న్యాయం సాయం అందిస్తానన్నారు. ఈ గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీ మండల అధ్యక్షుడు జిల్లా రమేష్, కూరపాటి కోటేష్, నాయకులు ఉన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

నల్లగొండ టౌన్ : తెలంగాణ రాష్ట్రంలో రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు, లేబర్ కోడ్స్ రద్దుకై మే 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ లక్ష్మీనారాయణ కార్మికులకు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో జిల్లా రోడ్డు ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో ఏటకు సమ్మె నోటీసు అందజేసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 12లక్షల మంది రవాణా రంగ కార్మికులు పనిచేస్తున్నారని వారందరి సంక్షేమం కోసం ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి ప్రమాద బీమా, పెన్షన్, ఆరోగ్య బీమా తదితర సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పెంజర్ల సైదులు, అద్దంకి నరసింహ, నవీన్ పాల్గొన్నారు.

పగలు విద్యుత్ వెలుగులు

పెద్దవూర : మండల కేంద్రంలోని జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన వీధి దీపాలు పగలు సైతం వెలుగుతూ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. వేసవికాలం కావడంతో విద్యుత్‌కు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. రాత్రనక పగలనక హైమాస్ట్ లైట్లు వెలుగుతుండటంతో విద్యుత్ వృథా అవుతుంది. రాత్రివేళ రహదారులకు వెలుగు అందించి ప్రజల రక్షణకు మెరుగుపర్చేలా వీధి దీపాలను ఏర్పాటు చేశారు. నాగార్జునసాగర్ ప్రపంచ పర్యాటక కేంద్రం కావడంతో నిత్యం ఈ రహదారిపై వీవీఐపీలు సైతం వెళ్తుంటారు. మండల కేంద్రానికి మండల, జిల్లా స్థాయి అధికారులు సైతం వస్తున్నప్పటికీ పగలు వెలుగుతున్న వీధి దీపాలు కనిపించడం లేదు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కొన్ని వీధి దీపాలు అసలు వెలగడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాలు పగలు వెలగకుండా చూసి విద్యుత్ వృథాను అరికట్టాలని, చెడిపోయిన వీధి దీపాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



పెద్దవూరలో పగలు వెలుగుతున్న వీధి దీపాలు

యువతకు ఉపాధి కల్పనలో పాలకులు విఫలం



ఏఐవైఎఫ్ జెండా ఎగురవేస్తున్న మల్లేష్

దేవరకొండ : యువతకు విద్య, వైద్యం, ఉపాధి కల్పించడంలో పాలకులు విఫలమయ్యారని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఏషమోని మల్లేష్ అన్నారు. శనివారం ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని దేవరకొండలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన ఏఐవైఎఫ్ జెండాను ఎగురవేసి మాట్లాడారు. దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దడం లో యువత పాత్ర ప్రధానమైనదని తెలిపారు. యువతలో ప్రగతిశీల, అభ్యుదయ భావాలు, దేశభక్తి, నైతిక విలువలను పెంపొందించడంలో అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) కృషి చేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జూలూరి మహేష్, వలమల్ల ఆంజనేయులు, పోలగోని గణేష్, జంగయ్య, శ్రీను, పాండు, జాకీర్, తదితరులున్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దులు మృతి



మృతి చెందిన ఎద్దుల వద్ద రోదిస్తున్న రైతు

పెద్దవూర : విద్యుదాఘాతానికి గురై రెండు ఎద్దులు మృతి చెందిన సంఘటన శనివారం మండలంలోని నాయినివానికుంటతండాలో చోటు చేసుకుంది. తండాకు చెందిన రమావత్ సైదానాయక్ తనకున్న కాడెద్దులను పశుగ్రాసం కోసం మేపటానికి వ్యవసాయ పొలాలకు తోలుకుని వెళ్లాడు. మండలంలో శుక్రవారం రాత్రి వీచిన బలమైన ఈదురుగాలులకు విద్యుత్ తీగలు కిందపడిపోయాయి. ఉదయం మేపటానికి తోలుకుని వెళ్లిన ఎద్దులు మేసుకుంటూ కింద పడిపోయిన విద్యుత్ తీగలను తాకడంతో రెండు ఎద్దులు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాయి. రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేద కుటుంబానికి చెందిన బాధిత రైతు సైదానాయక్ తనకున్న భూమిలో వ్యవసాయం చేసుకోవడంతో పాటు కిరాయి అరకలకు వెళ్తూ జీవనం సాగిస్తున్నాడు. దీంతో కాడెద్దులు రెండు మృతి చెందటంతో బాధితరైతు లబోదిబోమంటున్నాడు. మృతి చెందిన ఎద్దుల విలువ రూ. 1.30లక్షలు ఉంటుందని పేర్కొన్నాడు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

ఘనంగా ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ వేడుకలు



కాంగ్రెస్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న అంబటి సోమన్న, చిరుమర్రి కృష్ణయ్య

మిర్యాలగూడ : ఐఎన్‌టీయూసీ 78వ ఆవిర్భావ వేడుకలను శనివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రెసిడెంట్ అంబటి సోమన్న, పీసీసీ సభ్యుడు చిరుమర్రి కృష్ణయ్యలు కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేసి మాట్లాడారు. దేశంలో ఐఎన్‌టీయూసీ అతి పెద్ద కార్మిక సంఘమన్నారు. ఐఎన్‌టీయూసీ కార్మికుల పక్షాన పోరాడి ఎన్నో విజయాలు సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో పెరిక వెంకటేశ్వర్లు, మెరుగు శ్రీనివాస్, పైడిమర్రి నరసింహారావు, టి.రాములు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలతో సంబంధం లేని వారిని నియమించాలి

నల్లగొండ టౌన్ : తెలంగాణ సమాచార హక్కు చట్టం కమిషనర్లుగా రాజకీయాలతో సంబంధం లేని వారిని నియమించాని ప్రజా సంఘాలు డిమాండ్ చేశారు. ఈ విషయమై శనివారం వివిధ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటగిరి దైవాధీనం మాట్లాడుతూ.. సమాచార కమిషనర్ల నియామకానికి గవర్నకు పంపిన పేర్లను క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గాదే వినోద్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో సామాన్య ప్రజలకు న్యాయం జరగాలంటే సమాచార కమిషనర్లను న్యాయబద్ధంగా వ్యవహరించే వారిని నియమించాలని ప్రస్తుతం నియమించిన వారి విషయంలో మరోసారి పరిశీలన జరపాలని కోరారు. సమావేశంలో ఎండీ రజీవుద్దీన్, తలారి రాంబాబు, కట్టెల శివకుమార్, బండమీది అంజయ్య, కర్నాటి యాదగిరి, బైరు సైదులుగౌడ్, శ్రీనివాస్, రవీందర్, యాదగిరి, శోభ, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకోని పల్లె దవాఖానాలు

- సమయపాలన పాటించని వైద్యులు
- గ్రామీణులకు అందని వైద్యం

చింతపల్లి : గ్రామీణులకు వైద్య సదుపాయం అందుబాటులో ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పల్లె దవాఖానాలను ఏర్పాటు చేసింది. విధుల్లో సిబ్బంది నిర్లక్ష్యంతో చాలా పల్లెల్లో దవాఖానాలు అలంకార ప్రాయంగా మారాయి. చింతపల్లి మండలం వీటీ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కుర్మపల్లి, పోలేపల్లి రాంనగర్, పల్లె దవాఖానాలో వైద్యసిబ్బంది అందుబాటులో ఉండటం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో తాళం వేసి ఉన్న పల్లె దవాఖానాను 'సాక్షి' క్లిక్ మనిపించింది. పలు చోట్ల పల్లె దవాఖానాల్లో సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. చిన్నపాటి వైద్యానికి మండల కేంద్రాలకు వెళ్లకుండా వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిన ప్రయోజనమే లేకుండా పోయింది. గ్రామాలు మండల కేంద్రాలకు పది నుంచి 20కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. దీంతో దూరభారం కావడంతో అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్స అందక ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వారానికి రెండు సార్లు ..

చింతపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో 3పల్లె దవఖానాలు 2సబ్ సెంటర్ లు, వీటీ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో రెండు పల్లె దవాఖానాలు, రెండు సబ్ సెంటర్లు ఉన్నాయి. ఇప్పటికే అన్ని చోట్ల వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. కానీ కుర్మపల్లి, పోలేపల్లి రామ్ నగర్ పల్లె దవాఖానాల్లో అసలు వైద్యులు లేక పోవడంతో మూసిన తలుపులు తెరవడం లేదు. దీంతో పల్లె ప్రజలు చిన్నపాటి జ్వరం, అస్వస్థతలకు మండల కేంద్రాల్లోని ఆస్పత్రులకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. హైదరాబాద్ మహానగరం నుంచి రాకపోకలు ఉండడంతో వారానికి ఒకటి రెండు సార్లు ఏఎన్ఎం, వస్తూ పోతున్నారని స్థానికులు చెబుతున్నారు.



చింతపల్లి మండలం పోలేపల్లి రాంనగర్‌లో మూసి ఉన్న పల్లె దవాఖాన

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటాం



పల్లె దవాఖానాల్లో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటాం. కుర్మపల్లి పల్లె దావఖన ఏఎన్ఎం సాయి రెడ్డిగూడెం గ్రామంలో వ్యాక్సిన్ కు వెళ్ళింది, ఆశ వర్కర్లు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధుల్లో ఉండాలి. విధులకు సక్రమంగా హాజరుకాని వైద్య సిబ్బంది పట్ల కఠినంగా వ్యవహరిస్తాం. వైద్యులు, ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ వంశీకృష్ణ, వైద్యాధికారి

బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన



పానగల్లు వేంకటేశ్వరస్వామి ఆలయంలో అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండల పట్టణ పరిధిలోని పానగల్లులో ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో సంస్థ సభ్యుడు బండారి రమేష్ బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, మన పరిసర ప్రాంతాలలో బాల్యవివాహాలు జరిగితే 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలన్నారు. బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పూజారులు శ్రవణ్ ఆచార్య, ప్రశాంత్ ఆచార్య, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు



పల్లెప్రకృతి వనంలో నీటి నిల్వ కోసం కందకాలు తీస్తున్న కూలీలు

- భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా పనులు
- అడవిదేవులపల్లిలో 6150మందికి జాబ్‌కార్డులు
- 3250మందికి పైగా ప్రతి రోజూ పనులకు హాజరు

అడవిదేవులపల్లి : మండలంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలో 13 గ్రామ పంచాయతీలుండగా ఆయా గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులు జరుగుతున్నాయి. ప్రతి నీటిబోట్టును ఒడిసి పట్టేందుకు ప్రతి రైతు వ్యవసాయ భూమి చుట్టూ వర్షపు నీరంత భూమిలోకి ఇంకే విధంగా ప్రణాళికను రూపపొందించి అందుకు అనుగుణంగా పనులను చేపడుతున్నారు. ప్రతి రోజు 3250 మంది కూలీలు పనులను చేస్తున్నారు. అదే విధంగా నర్సరీల్లో మొక్కలను చేపడుతున్నారు. ఎండ ప్రభావం నుంచి రక్షణ కల్పించేందుకు పెడికేట్‌ను ఏర్పాటు చేసి ప్రతి మొక్క పెరిగే విధంగా చర్యలు చేపడుతున్నారు.

చేపడుతున్న పనులు ఇవే..

ఉపాధి హామీ పనుల్లో అత్యధికంగా నీటి వనరులను పెంచేందుకు పనులను చేపడుతున్నారు. రైతుల సంక్షేమం కోసం భూగర్భ జల వనరులు పెంచేలా ప్రత్యేక్షంగా, పరోక్షంగా నీటి వసతి లభించే విధంగా పనులను చేపడుతున్నారు. కందకాల తవ్వకాలు, పంట పొలాల్లో రాళ్ల వేరటం, కంప చేట్లు తొలగించడం, పూడీకతీత పనులు, పంట కాలువల మట్టిరోడ్డు నిర్మాణం వంటి పనులను ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్నారు. మండలం 13గ్రామ పంచాయతీలు ఉండగా 6150 మందికి జాబ్‌కార్డులు కలిగి ఉన్నాయి. అయితే వీరిలో 3250 మంది ప్రతి రోజు పనులను చేపడుతున్నారు. గత ప్రభుత్వం రూ.300నిర్ణయించగా ఈ ఏడాదిలో రూ.307లకు ప్రస్తుతం ప్రభుత్వం కూలి రేట్లను పెంచడంతో ఉపాధి హామీ కూలీలు మరింత పెరిగారు.

అందరికి పని కల్పిస్తాం

ఉపాధి హామీ పనుల కింద అన్ని రకాల పనులను చేపడుతున్నాం. అదే విధంగా కూలీలకు పని దినాలు ఎక్కువగా దొరికేలా పని కల్పిస్తున్నాం.

– సూర్యానాయక్, ఏపీఓ, అడవిదేవులపల్లి